నీటి సంఘాలకు ఎన్నికలెప్పుడో?

- చివరిసారిగా 2006లో ఎన్నికల నిర్వహణ
- అధ్వానంగా మారుతున్న చెరువులు
- పట్టించుకోని ప్రభుత్వాలు

బాన్సువాడ: పదహారేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువులు అధ్వానంగా మారాయి. మరో వైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినా.. వాటిపై అజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతులపై దృష్టి పెట్టే వారు కరువయ్యారు. చెరువుల అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మిషన్ కాకతీయ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి విడుదల తదితర పర్యవేక్షణ పనులను నీటి సంఘాల పాలకవర్గాలు చేపట్టేవి. పదహారేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటి పర్యవేక్షణ కరువైంది.

గతంలో ఇలా..

గతంలో ప్రభుత్వాలు 100 ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవి. ఈ ఎన్నికల్లో రైతులు నీటి సంఘం చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునే వారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో సాగు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని చెరువుల తూములు, పంట కాలువలు, అలుగులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పని చేయక సాగు నీరు రాక నిరుపయోగంగా మారాయి.



నిర్వహణ లేకపోవడంతో బాన్సువాడ కల్కి చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

2006 నుంచి ఎన్నికలు బంద్..

జిల్లాలో నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టులతో కలిపి 798 చెరువులు ఉండగా వీటిలో మెజార్టీ చెరువులు 100 ఎకరాల ఆయకట్టుకు పైగా సాగు నీటిని అందిస్తున్నాయి. 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వంద ఎకరాల ఆయకట్టుకు పైగా ఉన్న ప్రధాన చెరువులకు రెండు సంవత్సరాల కాలానికి గాను సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటి నుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి



బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ పథకం కింద చెరువులను అభివృద్ధి చేశాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెరువులు, రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవు. నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి పాలకవర్గం ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండడంతో సాగునీరు పొదుపుగా వాడుకునేవారు. ప్రస్తుతం చెరువులపై అజమాయిషీ లేకుండా పోయింది. చెరువులు, తూముల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి.

–షేక్ జుబేర్, మున్సిపల్ వైస్ చైర్మన్, బాన్సువాడ

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

బాన్సువాడ: మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు మాత్రం తీవ్ర అన్యాయం చేసిందని సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ అన్నారు. శనివారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయని అన్నారు. జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు జీవన భృతి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న బాన్సువాడలో ఆటో డ్రైవర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

ఉపాధి హామీ సామాజిక తనిఖీలో అవకతవకలు

పిట్లం(జుక్కల్): స్థానిక మండల పరిషత్ ఆవరణలో శనివారం 15వ విడత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి వామన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో డీఆర్పీలు పంచాయతీలవారీగా ఉపాధి హామీలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన1.83 కోట్ల ఉపాధి హామీ పనులను చదివి వినిపించారు. ఈ సామాజిక తనిఖీలో అవకతవకలు అనేకం బహిర్గతమయ్యాయి.పలు గ్రామాలలో మస్టర్లలో సంతకాలు లేకున్నా డబ్బులు డ్రా చేసినట్టు, గ్రామాలలో నివాసం లేని వ్యక్తులపైన డబ్బులను డ్రా చేసినట్లు, కళ్లు లేని వారు పనిచేసినట్లు, ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏడు రిజిస్టర్లు నిర్వహణ చేయవలసి ఉండగా చేయకపోవడం, పనులకు సంబంధించి కొలతలు సక్రమంగా నమోదు చేయకపోవడం, రాంపూర్‌లో క్షేత్ర సహాయకుడు తన కుటుంబ సభ్యులు పనులు చేయకపోయినా చేసినట్లు చూపించి డబ్బులు డ్రా చేసినట్లు తనిఖీలో బయటపడింది. బాధ్యుల నుంచి డబ్బులు రికవరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో కమలాకర్, ఏపీవో మహేష్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు'



భిక్కనూరు పోలీసుల అదుపులో సంజయ్

భిక్కనూరు: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ప్రభుత్వం ఆపలేదని ఏబీవీపీ కామారెడ్డి ఎస్ఎఫ్‌డీ ఇన్‌చార్జి గంధం సంజయ్ అన్నారు. శనివారం భిక్కనూరు పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాసర ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందుగానే సంజయ్‌ను అదుపులోకి తీసుకుని భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలో లేనప్పుడు బాసర ట్రిపుల్ ఐటీకి పోలీసుల కన్నుగప్పి వచ్చిన రేవంత్‌రెడ్డి పదవి రాగానే ట్రిపుల్ ఐటీ సమస్యలను పట్టించుకోకుండా ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్నారన్నారు. అనంతరం సంజయ్‌ను సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



గోపాల్‌పేటలోని వేణుగోపాల స్వామి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాలలో గల ఆలయాలలో శుక్రవారం రాత్రి, శనివారం మహిళలు దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలలో దీపాలను వెలిగించి కార్తీక పురాణాన్ని పఠించారు. అలాగే ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



ఆకాశదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

సరస్వతి మాత ఆలయంలో..

కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతీ మాత ఆలయంలో 16వ రోజు కార్తీక శనివారం సందర్భంగా భక్తులు ఆకాశ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, మహేష్, రాములు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు విద్యార్థి ఎంపిక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జి. శివకుమార్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కే. హీరాలాల్ తెలిపారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి ఎంపికైనందుకు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ నెల 17 నుంచి 19 వరకు మహబూబాబాద్ జిల్లాలోని ఎల్పూరు పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎల్లారెడ్డి: పట్టణంలోని 7వ వార్డులో గల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌కు వినతి ప్రతం అందించారు. కాలనీలో మురికి కాలువల శుభ్రం లేకపోవడంతో పాటు, పలు కుటుంబాలకు నీటి సమస్య ఉందని, దీనిని పరిష్కరించాలని కోరారు. స్పందించిన చైర్మన్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్యాలాల రాములు, భూమయ్య, సాయిప్రసాద్, పోచయ్య తదితరులున్నారు.



చైర్మన్‌కు వినతిపత్రమిస్తున్న కాలనీవాసులు

గ్రూప్-4 ఉద్యోగం సాధించిన బోర్లం రైతు బిడ్డ



సీహెచ్ కిరణ్

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామానికి చెందిన రైతు చిట్టంపల్లి రాములు కుమారుడు చిట్టంపల్లి కిరణ్ గురువారం ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్ సొసైటీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. కిరణ్‌ను గ్రామ మాజీ సర్పంచ్ సరళా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రావణి దేవేందర్‌రెడ్డి, నాయకులు పర్వారెడ్డి, నర్సింలు, మంద శ్రీనివాస్, సునుగురు సత్యం తదితరులు అభినందించారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే



భిక్కనూరులో సర్వేపై జీపీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి



వెల్లుట్లపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

సాక్షి నెట్‌వర్క్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో నిర్విరామంగా కొనసాగుతోంది. శనివారం ఆయా బ్లాకుల పరిధిలో ఎంపీడీవోలు, ఇతర ఉన్నతాధికారులు సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు పంచాయతీ కార్యదర్శులు సహకరించి సర్వేకు కావాల్సిన వివరాలు సేకరించాలని సూచించారు. అలాగే సర్వే చేసిన పత్రాలను ప్రతి రోజూ ఎంపీడీవో కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.




సోమేశ్వర్‌లో .. ఎంపీడీవో బషీరుద్దీన్



సముందర్ తండాలో.. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి

పేదల సంక్షేమ కోసం పోరాడుతాం



మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ నేతలు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయడం లేదని, ఇక ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేయబోతున్నామని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి, పేదలకు ఇళ్ల కోసం ప్రజలతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మణ్, జిల్లా నాయకులు గంగరాజు, రాజశేఖర్, కవిన్, రామకృష్ణ, సత్యం, వినయ్ పాల్గొన్నారు.

విద్యా శాఖలో విలీనం చేయాలి



కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



లింగంపేట నుంచి..

కామారెడ్డిరూరల్/లింగంపేట(ఎల్లారెడ్డి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ కామారెడ్డి జిల్లా నుంచి ఛలో హైదరాబాద్ ఇందిరాపార్కు కార్యక్రమానికి వందలాది మంది ఉద్యోగులు శనివారం తరలివెళ్లారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు. 2023 సెప్టెంబర్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, వరంగల్‌లో నిర్వహించిన ధర్నా శిబిరంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. 11 నెలలు గడుస్తున్నా నేటి వరకు ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని వెంటనే విద్యా శాఖలో విలీనం చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేపడతామన్నారు. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఉద్యోగులు సామల రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి

- దెగ్లూర్‌లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం

మద్నూర్(జుక్కల్): మహారాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం బీజేపీని గెలిపించాలని ఏపీ డిప్యూటీ సీఎం, సినిమా నటుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలానికి సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ పట్టణంలో శనివారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జితేష్ రాహుసాహెబ్ అంతాపూర్‌కర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పవన్ కళ్యాణ్‌కు రాజ్యసభ ఎంపీ అశోక్‌రావ్ చవాన్, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మహాయుతి కూటమి నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహరాజ్ గడ్డపై అడుగు పెట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. శివసేన–జనసేన పార్టీలు సనాతన ధర్మాన్ని రక్షించడానికే ఆవిర్భవించాయన్నారు.



స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

బొట్టు పెట్టి.. గులాబీ పువ్వు ఇచ్చి..

నిజాంసాగర్(జుక్కల్): బొట్టు పెట్టి, గులాబీ పువ్వుతో స్వాగతిస్తూ స్వయం సహాయక సంఘంలో చేరాలని మహిళలు కోరుతున్నారు. శనివారం మహమ్మద్‌నగర్ మండలం బూర్గుల్‌లో గ్రామ సంఘం అధ్యక్షురాలు శ్వేత ఆధ్వర్యంలో ఐకేపీ అధికారులు, మహిళలు ఇంటింటికీ తిరిగారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్క మహిళ స్వయం సహాయక సంఘంలో చేరి మహిళా సభ్యురాలిగా ఉండాలన్నారు. బూర్గుల్‌లో 333 మంది మహిళలు ఉండగా 155 మంది మహిళలు ఐకేపీ మహిళా సంఘంలో లేరు. వారందరిని సంఘంలో చేర్చుకోవడం లక్ష్యంగా మహిళలు ఇంటింటికీ తిరుగుతూ మహిళలను స్వాగతిస్తున్నారు. ఐకేపీ సీసీ విఠల్, సీఏ మొట్ట భూమయ్య తదితరులున్నారు.



బూర్గుల్‌లో గులాబీ పువ్వు ఇచ్చి సంఘంలో చేరాలని ఆహ్వానిస్తున్న మహిళలు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



దేవునిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో..



పాల్వంచ ఉన్నత పాఠశాలలో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ కేంద్రంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియా రెడ్డి విచ్చేసి మాట్లాడారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో పాటు చక్కని విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల హెడ్మాస్టర్ గంగాకిషన్, 37వ వార్డు కౌన్సిలర్ పాత శివకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కిడ్నీ బాధితుడికి చైర్‌పర్సన్ చేయూత

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ చెందిన నవీన్ కుమార్ కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మానవత్వం చాటారు. శనివారం బాధితుడి కుటుంబ సభ్యులకు తమ వంతుగా రూ.15 వేలను అందజేసి అండగా నిలిచారు. పేదరికం, ఆపదలో ఉన్న బాధితులకు దాతలు తమవంతుగా ఆదుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, వనిత, లత, స్వప్న, మానస, కన్నయ్య, కో–ఆప్షన్ సభ్యురాలు పుల్లూరి జ్యోతి, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, సాయిబాబా తదితరులున్నారు.



నగదు అందజేస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

పంట సాగులో మెలకువలు పాటించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పంటల సాగులో మెలకువలు పాటించాలని అగ్రికల్చరల్ ట్రైనింగ్ విద్యార్థులు అన్నారు. ఎర్రాపహాడ్ రైతు వేదికలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఈ సీజన్‌లో వేరుశనగ, కుసుమ, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలన్నారు. పంటలు వేసే ముందు విత్తనాల రకాలు, మోతాదు, శుద్ధి తదితర చర్యలు తీసుకోవాలన్నారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడవద్దని అవసరమైన మేరకే ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు.



ఎర్రాపహాడ్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

క్లుప్తంగా

చేప పిల్లల విడుదల



బాన్సువాడ రూరల్: ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై సరఫరా చేసిన చేప పిల్లలను శనివారం మండలంలోని నాగారం గ్రామ గిద్దల చెరువులో మత్స్య కార్మికులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్స్య కార్మిక సహకార సంఘం అధ్యక్షుడు అమృతం కిష్టబోయి మాట్లాడుతూ.. గతంలో కంటే ఈసారి నాణ్యమైన చేపవిత్తనాలు వచ్చాయన్నారు. మత్స్య కార్మికులు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశానుసారం జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ శిరీష, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



భిక్కనూరు: జంగంపల్లిలోని మల్లు స్వరాజ్యం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఇంటి నంబర్లను కేటాయించి కరెంటు మీటర్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు, భూసాధన సమితి ప్రతినిధులు అర్జున్, బాల్‌రాజు, పేరం నర్సవ్వ, జంగం సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి



ఎల్లారెడ్డి: విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు శనివారం కోరారు. ఎల్లారెడ్డిలో పేరుకుపోయిన బకాయిలకు సంబంధించి వాటిని వసూలు చేసేందుకు సిబ్బంది 16 బృందాలుగా ఏర్పడి విద్యుత్ బకాయిలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

మరమ్మతులు చేయించాలని వినతి



ఎల్లారెడ్డిరూరల్: వెల్లుట్లలో బోరు మోటారు చెడిపోవడంతో పలు కాలనీలలో నీటి సమస్య ఏర్పడిందని కాలనీవాసులు శనివారం తెలిపారు. గ్రామంలోని 5, 6వ వార్డుల పరిధిలో గల బోరు మోటార్లు చెడిపోయి వారం రోజులు కావస్తున్నా మరమ్మతులు చేయించకపోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోరు మోటారు అందజేత



ఎల్లారెడ్డిరూరల్: అల్మాజీపూర్‌లో నీటి ఎద్దడి ఉండడంతో గ్రామానికి మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్ శనివారం బోరు మోటారును అందించారు. గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు బోరు మోటారును అందించిన ఉషాగౌడ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, గ్రామస్తులు తదితరులున్నారు.